

టన్ను చీనీ రూ.24 వేలు


అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.24 వేలు, కనిష్టంగా రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.



వైభవంగా శ్రీవారి చక్రస్నానం

ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారి చక్రస్నానం (తీర్థవాది) శనివారం భృగుతీర్థంలో వైభవంగా జరిగింది.

8లో



న్యూస్‌రీల్

మున్సిపాలిటీ స్థలం కబ్జా

- దర్గాగా షెడ్డు వేస్తున్న టీడీపీ నేత



మున్సిపల్ భూమిలో దుకాణాల కోసం టీడీపీ నేత ఏర్పాటు చేస్తున్న షెడ్లు

చిలమత్తూరు: హిందూపురం మున్సిపాలిటీ స్థలాన్ని ఓ టీడీపీ నాయకుడు కబ్జా చేశాడు. అంతేకాకుండా ఆ స్థలంలో దర్గాగా షెడ్ల నిర్మాణం చేపట్టాడు. హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని కొట్నూరు సర్వే నంబరు 259/1సీలో 18 సెంట్ల ఖాళీ స్థలం ఉంది. ఇది గ్రామ కంఠంగా రికార్డుల్లో నమోదై ఉంది. దీనిపై కన్నేసిన టీడీపీ నాయకుడు గతంలోనే ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించగా.. మున్సిపల్ అధికారులు అడ్డుకున్నారు. అనంతరం అక్కడ నోటీసు బోర్డు కూడా ఏర్పాటు చేశారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో సదరు నాయకుడు మళ్లీ కబ్జాకు తెగించాడు. శనివారం మున్సిపల్ అధికారులు నాటిన బోర్డును తొలగించి షెడ్ల నిర్మాణాలు చేపట్టాడు. దీంతో మున్సిపల్ అధికారులు ఆ పనులను తాత్కాలికంగా నిలిపివేయించారు. టీడీపీలో కీలకంగా వ్యవహరిస్తున్న సదరు నాయకుడు... గతంలోనూ పట్టణంలోని మరొక ప్రాంతంలో ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి చేజిక్కించుకున్నారన్న ఆరోపణలున్నాయి.



కొట్నూరులోని ప్రభుత్వ స్థలంలో మున్సిపల్ అధికారులు నాటిన నోటీసు బోర్డు (ఫైల్)

కూటమి కినుక.. చేను తడవక

మడకశిర.. వ్యవసాయం తప్ప మరో ఆధారం లేని ప్రాంతం. వర్షాధారంపైనే ఆధారపడి ఇక్కడి రైతులు పంటలు సాగు చేస్తారు. వర్షాభావ పరిస్థితుల్లో పొలాలన్నీ బీళ్లుగా మారుతాయి. జనమంతా పొట్టకూటికోసం కర్ణాటకకు వలస వెళ్లాల్సిన పరిస్థితి. ఈ పరిస్థితులను అర్థం చేసుకున్న వైఎస్ జగన్ నియోజకవర్గంలో కృష్ణా జలాలు పారించి ఈప్రాంత రైతులకు మేలు చేశారు. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం మడకశిరపై శీతకన్ను వేసింది. సాగునీరు ఇవ్వకుండా రైతులను అష్టకష్టాలు పెడుతోంది.

మడకశిరలో సాగునీటి ఘోష

- నేటికీ పూర్తి కాని హంద్రీ–నీవా పనులు
- కృష్ణా జలాలు అందక పొలాలు బీళ్లు పెట్టిన రైతులు
- వైఎస్ జగన్ హయాంలో మూడేళ్లు పారిన కృష్ణా జలాలు
- గత ప్రభుత్వంలోనే ఎంబీసీకి రూ.214.85 కోట్ల మంజూరు
- హెచ్ఎన్ఎస్ఎస్ పనుల పూర్తికి రూ.70 కోట్లతో ప్రతిపాదనలు
- తాజాగా 'బైపాస్ కెనాల్'కు మంగళం పాడిన కూటమి ప్రభుత్వం



అగళి మండలంలో అసంపూర్తిగా ఉన్న హెచ్ఎన్ఎస్ఎస్ మైనర్ కాలువ

నియోజకవర్గంలో మైనర్ ఇరిగేషన్ చెరువుల సంఖ్య	47
నియోజకవర్గంలోని రైతులు	46,838
ఐదు మండలాల్లో చెరువుల కింద ఆయకట్టు	17,500 ఎకరాలు
సాగునీరు పూర్తిగా అందని మండలాలు:	అమరాపురం, గుడిబండ, రొళ్ల, అగళి

మడకశిర: సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్న మడకశిర నియోజకవర్గంలోని రైతుల పరిస్థితి చూసి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చలించిపోయారు. 2004లో హంద్రీనీవా సుజల స్రవంతి పథకం (హెచ్ఎన్ఎస్ఎస్) ద్వారా నియోజక వర్గానికి కృష్ణా జలాలు ఇచ్చేందుకు శ్రీకారం చుట్టారు. ఆయన హయాంలోనే హంద్రీనీవా కాలువ పనులను 80 శాతం పూర్తి చేశారు. అయితే ఆయన భౌతికంగా దూరమయ్యాక మడకశిర రైతులను పట్టించుకున్న వారే కనిపించలేదు. మళ్లీ వైఎస్ జగన్ సీఎం అయ్యాక మడకశిర ప్రాంత రైతుల్లో ఆశలు చిగురించాయి.

వైఎస్ జగన్ చొరవతో..

వైఎస్ జగన్ సీఎం అయ్యాక హెచ్ఎన్ఎస్ఎస్ పథకాన్ని పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడానికి చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర నియోజకవర్గానికి కృష్ణా జలాలను చేరవేయడానికి బైపాస్ కెనాల్‌ను రూపొందించారు. పెనుకొండ నుంచి నేరుగా మడకశిరకు బైపాస్ కెనాల్ నిర్మించడానికి రూ.214.85 కోట్లు మంజూరు చేశారు. ఈ కెనాల్ నిర్మాణాన్ని వెంటనే చేపట్టేందుకు వీలుగా టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేశారు. వివిధ మండలాల్లో నిలిచిపోయిన హెచ్ఎన్ఎస్ఎస్ పనులు పూర్తి చేసేందుకు అధికారులు రూ.70 కోట్లతో ప్రతిపాదనలు పంపగా వైఎస్ జగన్ వెంటనే ఆమోదించి నిధుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఎన్నికలు రావడం, ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో హంద్రీనీవా పథకానికి గ్రహణం పట్టింది.

సమీక్షలకే పరిమితం..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి 9 నెలలు గడిచింది. హంద్రీ–నీవా సుజల స్రవంతి పథకంపై స్థానిక నాయకులు అధికారులతో పలుసార్లు సమీక్ష చేశారు. సంబంధిత మంత్రి కూడా సచివాలయంలో ఈ పథకంపై స్థానిక ప్రజా ప్రతినిధులతో సమీక్షించారు. కానీ నిధుల విడుదలపై ఎలాంటి ప్రకటన చేయలేదు. ప్రస్తుతం నియోజకవర్గంలో భూగర్భజలమట్టం తగ్గిపోగా బోర్లు పనిచేయడం లేదు. చెరువులకింద ఆయకట్టు పొలాలన్నీ బీళ్లుగా మారుతున్నాయి. దీంతో ఇటీవలే రైతు సంఘం నాయకులు స్థానిక తహసీల్దార్‌కు వినతి పత్రం కూడా ఇచ్చారు. అయినా పాలకుల్లో ఏమాత్రం స్పందన లేదు.

నీరిచ్చే అవకాశం ఉన్నా...

అమరాపురం, గుడిబండ, రొళ్ల, అగళి మండలాల్లో హంద్రీనీవా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. గుడిబండ మండలం శింగేపల్లి వద్ద హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి అగళి, రొళ్ల, గుడిబండ మండలానికి ఓ మైనర్ కాలువ, అమరాపురం మండలానికి మరో మైనర్ కాలువ వెళ్తుంది. ఈ మైనర్ కాలువ పనులను పూర్తి చేస్తే అమరాపురం, గుడిబండ, రొళ్ల, అగళి మండలాలకు కూడా సాగునీరు అందించడానికి అవకాశం ఏర్పడుతుంది. కనీసం ఈ పనులపై కూడా పాలకులు దృష్టి సారించలేదు. స్థానిక ఎమ్మెల్యే కూడా రైతుల సాగునీటి ఘోష పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మూడేళ్లు పారిన కృష్ణా జలాలు



వైఎస్ జగన్ హయాంలో కృష్ణాజలాలు వదలడంతో పూర్తిగా నిండి మరువ పారుతున్న మడకశిర చెరువు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వరుసగా మూడేళ్ల పాటు కృష్ణా జలాలు మడకశిర మండలానికి వచ్చాయి. మడకశిర చెరువును సైతం కృష్ణా జలాలలో రెండుసార్లు నింపారు. దీంతో నియోజకవర్గ రైతులంతా ఎంతో సంతోషించారు. మిగతా మండలాలకు కూడా కృష్ణా జలాలు వస్తాయని ఎంతో ఆశతో ఎదురు చూశారు. కానీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి సర్కార్ ఈప్రాంత రైతులను పూర్తిగా విస్మరించింది.

కాలువ పనులను పూర్తి చేయాలి



అగళి మండలంలో హంద్రీనీవా కాలువ పనులు పూర్తి కాలేదు. వెంటనే ప్రభుత్వం కాలువ పనులను పూర్తి చేసి సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు మడకశిర నియోజకవర్గంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కాలువ పనుల పూర్తికి నిధులు మంజూరు చేయాలి. వైఎస్ జగన్ మంజూరు చేసిన బైపాస్ కెనాల్ పనులను కూడా ప్రారంభించాలి.

– చంద్రప్ప, రైతు, మధూడి, అగళి మండలం

హామీ నిలబెట్టుకోవాలి



ప్రస్తుతం అగళి మండలంలో భూగర్భ జలమట్టం భారీగా తగ్గింది. బోర్లలోనూ నీళ్లు రావడం లేదు. కూటమి నేతలు ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు మడకశిర నియోజకవర్గంలో హంద్రీనీవా సాగునీటి పథకాన్ని పూర్తి చేసి అన్ని మండలాలకూ కృష్ణా జలాలు అందించాలి. లేకపోతే సాగునీటి సమస్యతో వ్యవసాయానికి స్వస్తి పలకాల్సి వస్తుంది.

– నాగరాజు, రైతు, అగళి

కౌలు రైతులకూ డ్రిప్ పరికరాలు

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఆదేశం

అనంతపురం సిటీ: కౌలు రైతులకూ డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు సరఫరా చేసి ఆదుకోవాలని, ఏ ఒక్క రైతుకూ అన్యాయం చేయొద్దని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘ–1, 2, 3, 4, 5, 6, 7(ఆర్థిక, ప్రణాళిక/గ్రామీణాభివృద్ధి/వ్యవసాయం/విద్య, వైద్య/పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ శాఖలు/ఐసీడీఎస్/ సాంఘిక సంక్షేమ శాఖలు) సమావేశాలు అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ప్రధాన సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుక్కరాయసముద్రం, గోరంట్ల, కణేకల్లు, నార్పల జెడ్పీటీసీ సభ్యులు భాస్కర్, జయరాం, పద్మావతి, వేదాంతం నాగరత్నమ్మ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, కనీసం తాగునీరు కూడా సరఫరా చేయకపోతే ఎలాగని అధికారులను నిలదీశారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ కల్పించుకుంటూ.. వేసవికి ముందే ఎక్కడెక్కడ తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉందో గుర్తించి, అందుకు తగ్గట్టు ప్రణాళికలు రూపొందించడంలో ఎందుకు వైఫల్యం చెందారంటూ రెండు జిల్లాల ఎస్ఈలను నిలదీశారు. తాగునీటి పథకాల నిర్వహణకు కోట్లాది రూపాయలు జెడ్పీ నుంచి నిధులు ఇస్తున్నా వాటర్ సీనరైజ్ ఛార్జెస్‌ను మున్సిపాలిటీల నుంచి వసూలు చేసుకొని వాడుకోవడం ఏమిటో అర్థం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీసత్యసాయి తాగునీటి పథకంలో ఫిల్టర్ బెడ్స్ మార్చాలని ఆదేశించారు. దళితవాడలు, గిరిజన తండాల్లో రహదారులు, తాగునీటి సమస్యలను తక్షణం పరిష్కరించాలని కంబదూరు జెడ్పీటీసీ సభ్యుడు గుద్దెళ్ల నాగరాజు అధికారులను కోరారు. పాఠశాలలను తరచూ తనిఖీలు చేస్తే ఉపాధ్యాయుల్లో బాధ్యత పెరుగుతుందని నార్పల జెడ్పీటీసీ నాగరత్నమ్మ అన్నారు. పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని గిరిజమ్మ సూచించారు. గత ప్రభుత్వం రూ. కోట్లు ఖర్చుపెట్టి అన్ని హంగులతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాల భవనాల్లో కొన్ని మండలాల్లో పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయడంపై అనంతపురం రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



స్థాయీ సంఘ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ఐసీడీఎస్‌ను బ్రోకర్లు శాసిస్తారా?

శ్రీసత్యసాయి జిల్లాలో ఐసీడీఎస్ జిల్లా కార్యాలయాన్ని ఓ బ్రోకర్ శాసిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని గోరంట్ల జెడ్పీటీసీ సభ్యుడు పాలే జయరాం నాయక్ ఆరోపించారు. సమగ్ర విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని జయరాం నాయక్ డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లాలోనూ కొందరు సీడీపీఓలు అవినీతి అక్రమాలకు పాల్పడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను గాలికొదిలేశారని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ ఆరోపించారు. ఈ అంశంపై ఐసీడీఎస్ శ్రీసత్యసాయి జిల్లా పీడీ భారతి స్పందిస్తూ.. తాను కొత్తగా వచ్చానని, పరిశీలించి చర్యలు తీసుకుంటానన్నారు. అనంతపురం అర్బన్ పరిధిలోని బుడ్డప్పనగర్ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త భాగ్యమ్మ పదేళ్లుగా విధులకు దుమ్మాకొట్టి, ప్రైవేటు కాలేజీలో అధ్యాపకురాలిగా పని చేస్తున్నట్లు గత సమావేశాల్లో అధికారుల దృష్టికి తెచ్చామని, ఆమెపై ఎటువంటి చర్యలు తీసుకున్నారని రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్ ఐసీడీఎస్ పీడీ నాగమణిని ప్రశ్నించారు. దీని వెనుక ఉన్న అధికారులపైనా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పీడీ నాగమణి స్పందిస్తూ.. ఈ రోజే తొలగింపు ఉత్తర్వులు ఆమెకు అందించామని సమాధానమిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో వడగండ్ల వాన



తనకల్లులో నేలకొరిగిన మొక్కజొన్న పంట



తనకల్లులో దెబ్బతిన్న దబ్బ చిక్కుడు పంటను చూపుతున్న రైతు ఆది



చిలమత్తూరులో వడగండ్ల వానకు దెబ్బతిన్న వరిపంట



తనకల్లులో కురిసిన వడగండ్లను చూపుతున్న యువకుడు



పాలేపల్లిలో వడగండ్ల వాన కురుస్తున్న దృశ్యం

చిలమత్తూరు/తనకల్లు: భానుడి భగభగలతో అల్లాడిపోతున్న జనంపై వరుణుడు కరుణ చూపాడు. వేసవి తీవ్రతతో జిల్లాలో పక్షం రోజులుగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా.. శనివారం మధ్యాహ్నం వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చేసుకున్నాయి. ఉష్ణోగ్రతలు తగ్గడంతో పాటు మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో మబ్బులు కమ్ముకున్నాయి. వెంటనే ఉరుములతో కూడిన వడగండ్ల వాన కురిసింది. తనకల్లు మండలంలో ఎన్ హెచ్–42పై వడగండ్లు పెద్ద ఎత్తున పడటంతో యువకులు కేరింతలు కొట్టారు. వడగండ్లను రోడ్డుపై కుప్పగా పోసి సెల్‌ఫోన్లతో చిత్రీకరించారు. కాగా, అకాల వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో టమాట, మొక్కజొన్న, దబ్బ చిక్కుడు పంటలు దెబ్బతిన్నాయి. ఇక చిలమత్తూరు మండల పరిధిలోని మొరసలపల్లిలోనూ వడగళ్ల వాన కురిసింది. పాలేపల్లిలో 20 ఎకరాల మేర కోత దశకు వచ్చిన వరి నేలపాలైంది. వడగండ్ల దెబ్బకు వడ్లు నేల రాలడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

క్లుప్తంగా

యూరియా ద్రావణం తాగి 20 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలను చూసి ఆవేదన చెందుతున్న కాపరి ఈశ్వరయ్య

కనగానపల్లి: వేపకుంటలో యూరియా కలిసిన ద్రావణం తాగి 20 గొర్రె పిల్లలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కాపరి ఈశ్వరయ్య శనివారం తన గొర్రెల మందను మేత కోసం సమీపంలోని వ్యవసాయ పొలం వద్దకు తీసుకెళ్లాడు. మేత మేసిన తర్వాత గొర్రెలు నీరు తాగేందుకు బోరుబావి వద్దకు వెళ్లాయి. వీటిలో కొన్ని గొర్రెలు డ్రిప్పు పైపులైన్ ద్వారా పంటకు వదలిన యూరియా ద్రావణాన్ని తాగాయి. ఆ నీరు ఎక్కువగా తాగిన 20 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని బాధిత గొర్రెల కాపరి ఆవేదన వ్యక్తం చేశాడు.

మహిళ అనుమానాస్పద మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ హేమంత్‌కుమార్ తదితరులు

ధర్మవరం రూరల్: రేగాటిపల్లి వద్ద తిమ్మన్నగారి నాగిరెడ్డి పొలం సమీపంలో చిట్రా అక్కమ్మ (40) అనే మహిళ అనుమానాస్పద రీతిలో మృతి చెందింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పొలంలో మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామానికి చెందిన చిట్రా అక్కమ్మగా పోలీసులు గుర్తించారు. అయితే భర్త ఓబులేసును వదిలేసి అక్కమ్మ ధర్మవరంలోని తిక్కస్వామి గుడి సమీపంలో ఒంటరిగా నివాసం ఉంటోంది. ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ రేగాటిపల్లి పొలంలో శనివారం విగతజీవిగా కనిపించింది. విషయం తెలుసుకున్న డీఎస్పీ హేమంత్‌కుమార్, సీఐ ప్రభాకర్, ఎస్‌ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. శవం బాగా కుళ్లి దుర్వాసన వస్తోంది. నాలుగు రోజుల కిందటే చనిపోయి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. శరీరంపై వస్త్రాలు లేకపోవడం, తల భాగం ఛిద్రమవడంతో అత్యాచారం చేసి చంపేశారా? ఇంకేమైనా జరిగిందా అన్నది అర్థం కావడం లేదు. పోలీసులు క్లూస్ టీంను రప్పించి ఆధారాల కోసం పరిశీలించారు. త్వరలోనే మిస్టరీని ఛేదిస్తామని చెబుతున్నారు.

అవినీతి తీగలు



రాష్ట్రంలో ప్రభుత్వం మారాక.. జగనన్న లేఅవుట్‌లో ఏమి చేసినా అడిగేవారు ఉండరని భావించిన విద్యుత్ సిబ్బంది చేతివాటం ప్రదర్శించారు. తాగునీటి బోర్ల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లను, పరికరాలను మాయం చేసేశారు. ఈ దందాలో ఓ లైన్‌మెన్ కీలక భూమిక పోషించాడు. విషయం ఆనోటా ఈ నోటా పొక్కడంతో ఉన్నతాధికారులు లైన్‌మెన్‌ను కాపాడేందుకు విఫలయత్నం చేస్తున్నారు.

- విద్యుత్ సిబ్బంది చేతివాటం
- జగనన్న కాలనీలో పరికరాలు మాయం
- దందాలో కీలకంగా వ్యవహరించిన లైన్‌మెన్
- కాలనీ వాసులకు అరకొరగా తాగునీటి సరఫరా
- బాధితులపై చర్యలు తీసుకోని అధికారులు



కుణుతూరు జగనన్న లేఅవుట్ , (ఇన్‌సెట్) కాలనీలో విద్యుత్ స్తంభాలపై మాయమైన తీగలు



విద్యుత్ స్తంభంపై కాసారాలు, తీగలు కనిపించని దృశ్యం

ధర్మవరం: పట్టణంలోని కుణుతూరు జగనన్న లేఅవుట్‌లో మూడు వేలకు పైగా పేదలకు గత ప్రభుత్వం ఇంటి పట్టాలు మంజూరు చేసింది. చాలామంది అక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. 2022 సంవత్సరంలో కాలనీలో ప్రజల ప్రయోజనార్థం తాగునీరు, ఇంటి నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టేందుకు ప్రభుత్వం నాలుగు బోర్లు వేయించింది. నీరు పుష్కలంగా పడటంతో ఆ బోర్లు పని చేసేందుకు ప్రత్యేకంగా విద్యుత్‌లైన్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రూ.15 లక్షల దాకా నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించారు. అయితే అప్పట్లో కొత్త విద్యుత్ స్తంభాలు, 11కేవీ, ఎల్‌టీ లైన్ లాగేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. కాలనీ ప్రారంభం నుంచి చివరన ఉన్న బోర్‌వెల్ వరకు విద్యుత్ సరఫరా జరిగేలా లైన్ లాగి ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇచ్చారు.

పరికరాలు మాయం..

లేఅవుట్‌లో మంచినీటి సరఫరా కోసం లాగిన లైన్‌లో విద్యుత్ ఉపకరణాలను మాయం చేసేందుకు ఓ లైన్‌మెన్ కూటమి ప్రభుత్వం రాగానే మాస్టర్ ప్లాన్‌వేశాడు. కాలనీలో ఉన్న నాలుగు బోర్లకు లాగిన విద్యుత్ లైన్‌కు బదులు చివరన ఉన్న బోర్‌కు మాత్రమే వేరే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కనెక్షన్ ఇచ్చాడు. మిగిలిన మూడు బోర్లకు సరఫరా బంద్ చేశాడు. మొత్తం 29 విద్యుత్ స్తంభాలు అప్పట్లో ఏర్పాటు చేయగా 18 విద్యుత్ స్తంభాలను, నాలుగు వరుసలు ఉన్న ఎల్‌టీలైన్ వైర్, కాసారాలను మాయం చేశాడు. వీటిని బ్లాక్ మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకున్నాడు.

ఘరానా మోసం వెలుగులోకి ఇలా...

కుణుతూరు జగనన్న లేఅవుట్‌లో నాలుగు బోర్లు అందుబాటులో ఉండగా ఒకటి మాత్రమే పని చేస్తుండటంతో నీటి ఎద్దడి మొదలైంది. దీంతో విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులకు పలువురు కాలనీవాసులు నీటి ఎద్దడి గురించి చెప్పగా.. అధికారులు విచారణ చేపట్టడంతో ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. విద్యుత్ ఉపకరణాలు మాయమయ్యాయని, ఇందులో లైన్‌మెన్ పాత్ర కీలకంగా ఉందని విచారణలో తేటతెల్లమైనట్లుగా సమాచారం. విషయం బయటకు పొక్కకుండా ఉండేందుకు విద్యుత్ ఉపకరణాలను యథాస్థానంలో ఉంచేలా చూడాలని లైన్‌మెన్‌కు అధికారులు చీవాట్లు పెట్టినట్లు తెలిసింది. ఈ విషయమై విద్యుత్‌శాఖ ఏడీఈ శివరాంను 'సాక్షి' వివరణ కోరగా సామగ్రిని కాలనీలో వేరే పనులకు వాడారేమో, ఏఈని కనుక్కోండి అంటూ దాట వేశారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



కుణుతూరు జగనన్న లేఅవుట్‌లో తాగునీటి బోర్ల కోసం లాగిన విద్యుత్ లైన్లలో చాలా వరకు స్తంభాలు, విద్యుత్ సామగ్రిని మాయం చేశానేజ ఇందులో విద్యుత్ సిబ్బంది ప్రమేయం స్పష్టంగా కనపడుతోంది. దీనిపై సమగ్ర విచారణ జరిపి.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– మధు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి, ధర్మవరం

ప్రజాధనాన్ని రికవరీ చేయాలి



నీటి ఎద్దడి నివారించేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్‌లైన్లను మాయం చేస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది. విద్యుత్ సిబ్బంది అవినీతి కారణంగా కాలనీలో ప్రజలకు తాగునీటి ఎద్దడి తీవ్రమవుతోంది. విద్యుత్ శాఖ అధికారులు ఈ ఉదంతంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుని, ప్రజాధనాన్ని రికవరీ చేయాలి.

– మానపల్లి సాయికుమార్, కౌన్సిలర్, ధర్మవరం

నూతన విద్యా విధానానికి అనుగుణంగా సిలబస్



బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ల సమావేశంలో మాట్లాడుతున్న వీసీ సుదర్శనరావు

అనంతపురం: నూతన జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా బీటెక్ కోర్సు సిలబస్ రూపకల్పన చేసినట్లు జేఎన్‌టీయూ(ఏ) వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు అన్నారు. బీటెక్ మూడు, నాలుగు సంవత్సరాలకు సంబంధించిన పాఠ్యాంశాలను రూపకల్పన చేయడానికి శనివారం యూనివర్సిటీలో బోర్డ్ ఆఫ్ స్టడీస్ సమావేశం నిర్వహించారు. అంతకుముందు వీసీ అధ్యక్షతన బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ల సమావేశం నిర్వహించారు. ప్రతి విభాగంలోనూ మైనర్, హానర్ డిగ్రీ ప్రోగ్రాంను ప్రతిపాదించారు. విద్యార్థి 18 క్రెడిట్లు అదనంగా చదివితే ఇంజినీరింగ్ డిగ్రీతో పాటు మైనర్, హానర్స్ డిగ్రీ ఇస్తారు. క్వాంటం కంప్యూటింగ్‌లో మైనర్ డిగ్రీ చేయడానికి అనుమతి ఉంటుంది. 40 శాతం క్రెడిట్స్ ఆన్‌లైన్‌లో చదువుకోవచ్చు. దీనితో పాటు కచ్చితంగా ఐదు రోజుల వర్క్‌షాపు, ప్రతి సెమిస్టర్‌లోనూ ఎక్స్‌పర్ట్ లెక్చర్, క్రెడిట్ డిపాజిట్ కోసం ఆమోదం తెలిపారు. ప్రతి విద్యార్థి ఫైనలియర్ రెండో సెమిస్టర్‌లో ఇంటర్న్‌షిప్, మూడో సెమిస్టర్ సమ్మర్ బ్రేక్‌లో ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. ఈ సిలబస్‌ను 2025–26 విద్యా సంవత్సరానికి మూడో సంవత్సరం చదువబోయే విద్యార్థులకు అమలు చేస్తారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఓఎస్డీ టూ వీసీ ప్రొఫెసర్ దేవన్న, ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తి, డీపీపీ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.

ఎంబార్కేషన్ పాయింట్ తొలగింపు కక్ష సాధింపే

- మండిపడిన వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక



ముస్లిం మైనార్టీ నాయకులతో కలిసి మాట్లాడుతున్న సమన్వయకర్త దీపిక

చిలమత్తూరు: గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో హజ్ యాత్రికుల సౌకర్యార్థం వైఎస్సార్‌సీపీ హయాంలో ఏర్పాటు చేసిన ఎంబార్కేషన్ పాయింట్ తొలగింపు కూటమి ప్రభుత్వ కక్షసాధింపులో భాగమేనని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక మండిపడ్డారు. శనివారం ఆమె హిందూపురంలో ముస్లిం మైనార్టీలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. అప్పటి ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, హజ్ కమిటీ చైర్మన్లు హజ్ యాత్రికులకోసం మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అప్పటి సీఎం జగన్ దృష్టికి తీసుకురాగా ఆయన గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో ప్రత్యేక సౌకర్యాలు కల్పించారని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో రెండు వేల మందికి పైగా హజ్ యాత్రకు పంపించారని, వారికి ప్రయాణ ఖర్చులు రూ.80 వేలు ఇచ్చిన ఘనత మాజీ సీఎం జగన్‌కు దక్కుతుందని కొనియాడారు. ఇప్పుడు ప్రయాణ చార్జీలు పెరిగిన కారణంగా రద్దు అయినట్టు చెబుతూ కేంద్రం 100 మందితో సరిపెట్టేస్తున్నా సీఎం చంద్రబాబు పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్నారు. రంజాన్ మాసంలో ముస్లింలకు కూటమి ప్రభుత్వం పెద్ద గిఫ్ట్ ఇచ్చిందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మైనారిటీ విభాగం అధ్యక్షుడు చాంద్‌బాషా, రాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్‌ఏ శివ, జిల్లా కారదర్శి తిప్పేరుద్రయ్య, కౌన్సిలర్ నాగరాజు, మైనార్టీ నేతలు హుమయూన్, సహేరా బాను, ఇనాయత్, ఆసిఫ్, నూరుల్లా, సాదిక్, షఫీవుల్లా, రఫీక్, సుహేల్, రజాక్ పాల్గొన్నారు.

కర్ణాటక వాసి పరిగిలో ఆత్మహత్య



విగతజీవిగా పడి ఉన్న జగదీష్

పరిగి: కర్ణాటక రాష్ట్రం యశవంతపురకు చెందిన జగదీష్ అనే యువకుడు పరిగిలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ రంగడు యాదవ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యశవంతపురలో నివాసముండే రాజన్న కుమారుడు జగదీష్ (31) మరాఠీ వ్యక్తి. ప్రింట్ బిలేబుల్ అనే కంపెనీలో డిస్పాచ్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నాడు. తల్లి గీత ఎనిమిది నెలల క్రితం అనారోగ్య కారణాలతో చనిపోయింది. జగదీష్‌కు ఉన్న ఒక్కగానొక్క సోదరి భవాని అంటే అమితమైన ప్రేమ. ఆమె కూడా గత శుక్రవారం యశవంతపురలో బలవన్మరణానికి పాల్పడింది. తల్లి, సోదరి మరణాన్ని జీర్ణించుకోలేకపోయిన జగదీష్ అదే రోజు సాయంత్రం పరిగి మండలానికి తన ద్విచక్రవాహనంపై వచ్చాడు. జయమంగళి బ్రిడ్జి కింద బైకు ఆపి.. వెంట తెచ్చుకున్న పురుగుల మందును కూల్ డ్రింక్‌లో కలుపుకుని తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి గొంతుపై చారలు ఉండటం గమనించారు. ఆరు నెలల క్రితం దారి దోపిడీ సమయంలో దుండగులు గొంతుకోసినట్లు తేలింది. మృతదేహం వద్ద కూల్‌డ్రింక్ బాటిల్, పురుగుమందు డబ్బాను స్వాధీనం చేసుకున్నారు. జగదీష్ మామ సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దారి దోపిడీ దొంగల ముఠా అరెస్ట్

గోరంట్ల: దారి దోపిడీ ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి కత్తి, కారు, నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను గోరంట్ల సీఐ బోయ శేఖర్ మీడియాకు వెల్లడించారు. ఈ నెల 19వ తేదీ రాత్రి పులగూర్లపల్లి వద్ద జాతీయ రహదారిపై పెనుకొండకు వెళ్లడానికి వేచి ఉన్న నందకుమార్ అనే ప్రైవేట్ కంపెనీ ఉద్యోగిని బెంగళూరు వైపు నుంచి కారులో వచ్చిన నలుగురు వ్యక్తులు బలవంతంగా లోనికి లాక్కున్నారు. అతడిని కత్తితో బెదిరించి రూ.60వేల నగదుతో పాటు బ్యాంకు ఖాతాలోని రూ.15,400ను దోచుకెళ్లారు. ఎలాగోలా బయటపడిన నందకుమార్ పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు శనివారం బెంగళూరు– హైదరాబాద్ జాతీయ రహదారిపై నలుగురు నిందితులైన తెలంగాణ రాష్ట్రం జగిత్యాల జిల్లాకు చెందిన గడం సంతోష్, పస్తం కళ్యాణ్, పస్తం శివాజీ, తూర్పాటి ఆదర్శ్‌ను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.12 వేల నగదుతో పాటు కత్తి, కారును సీజ్ చేశారు. అనతరం నిందితులను పెనుకొండ కోర్టులో హాజరుపరిచామని సీఐ తెలిపారు.

ప్రమోషన్ల తర్వాతే రేషనలైజేషన్ చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

ప్రశాంతి నిలయం: వీఆర్వోలకు ప్రమోషన్లు కల్పించిన తర్వాతే సచివాలయ ఉద్యోగుల రేషనలైజేషన్ ప్రక్రియ కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు నాయకులు శనివారం కలెక్టరేట్‌లో చాంబర్‌లో కలెక్టర్ చేతన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులను అర్హులైన వీఆర్వోలకు ప్రమోషన్లు కల్పించి రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మధు నాయక్, లక్ష్మీనారాయణరెడ్డి, డి.ఆంజినేయులు, పి.అశోక్ కుమార్, శ్రీనివాసులు, నజీర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి చక్రస్నానం



శ్రీవారికి పాలు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, గంధంతో స్నపనం



భృగుతీర్థంలో శ్రీవారికి చక్రస్నానం

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన శ్రీవారి చక్రస్నానం(తీర్థవాది)శనివారం వైభవంగా జరిగింది. ఉత్సవంలో భాగంగా ముందు శ్రీదేవి, భూదేవి సమేత నారసింహుడికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఆ తర్వాత శ్రీవారి సుదర్శన చక్రానికి భృగుతీర్థంలో ముంచి స్నానం చేయించారు. అనంతరం భక్తులు పెద్ద సంఖ్యలో భృగుతీర్థం(కోనేరు)లో పుణ్యస్నానాలు ఆచరించారు. చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు నిర్వహించిన వారికి, సహకరించిన వారికి, ఉత్సవాల్లో శ్రీవారిని దర్శించుకున్న వారికి ఇలా..అందరికీ ఉత్సవ యజ్ఞఫలం లభిస్తుందని అర్చకులు తెలిపారు. అలాగే శ్రీవారి చక్రస్నానం తర్వాత బ్రహ్మోత్సవాలకు సకలదేవతలను ఆహ్వానిస్తూ ఎగురవేసిన గరుడ పతాకాన్ని అవరోహనం చేశారు.

ఆలయంలోకి ప్రవేశించిన శ్రీవారు..

బ్రహ్మోత్సవాల కోసం ఇన్నాళ్లూ యాగశాలలోనే గడిపిన స్వామివారు చక్రస్నానం తర్వాత తిరిగి ఆలయంలోకి ప్రవేశించారు. అనంతరం అర్చకులు సాయంత్రం నుంచి ఆలయం తలుపులు మూసివేశారు. తిరిగి ఆదివారం ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొల్పుతారు. తీర్థవాది ఉత్సవంలో ఈఓ శ్రీనివాస రెడ్డి, ఆలయ సిబ్బంది, పట్టణ ప్రముఖులు, పోలీసులతో పాటు పాల్గొన్న భక్తులందరూ రంగులు చల్లుకొని ఆనందోత్సాహాలతో గడిపారు. కాగా, బ్రహ్మోత్సవాల ముగింపునకు నిదర్శనంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలో పుష్పయాగోత్సవం నిర్వహించనున్నారు.

నీటి కోసం నిరసన



చిలకలగడ్డపల్లి కొట్టాలలో రోడ్డెక్కిన మహిళలు

పుట్టపర్తి: వేసవిలో తాగునీటి సమస్య తీవ్రమవుతోంది. రోజుల తరబడి నీరు సరఫరా కాకపోతుండడంతో ప్రజలు ఆందోళనబాట పడుతున్నారు. బుక్కపట్నం మండలం చిలకలగడ్డపల్లి కొట్టాలలో మహిళలు శనివారం ఖాళీ బిందెలు చేతపట్టుకుని జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. తమ సమస్య గురించి అధికారులు, ఎమ్మెల్యే పల్లె సింధూర దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. తాగునీటి కోసం వ్యవసాయ బోర్ల వద్ద వృద్ధులు, పిల్లలు, మహిళలు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందన్నారు. నిరసన కార్యక్రమంలో అధికార టీడీపీ మద్దతుదారులు అధికంగా పాల్గొనడం గమనార్హం.

పరీక్ష కేంద్రంలో సౌకర్యాలపై ఆరా



పరీక్ష కేంద్రం వద్ద ఎంఈఓలతో చర్చిస్తున్న డీఈఓ

లేపాక్షి: మండల కేంద్రం లేపాక్షిలోని ఏపీ గురుకుల పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలను డీఈఓ జి.క్రిష్టప్ప శనివారం తనిఖీ చేశారు. మండల వ్యాప్తంగా ఎంతమంది పరీక్షలు రాస్తున్నారు, విద్యార్థులకు తగిన సౌకర్యాలు కల్పించారా లేదా అనే వివరాలను ఎంఈఓ నాగరాజుతో ఆరా తీశారు. అనంతరం డీఈఓ స్థానిక మెయిన్ ప్రాథమిక పాఠశాల, జెడ్పీ పాఠశాల (ఉర్దూ), బాలికల ఉర్దూ, బాలుర ఉర్దూ పాఠశాలలను సందర్శించి, విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు, తాగునీరు తదితర విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కుళ్లాయప్పతో పాటు ఉపాధ్యాయులు ఆయన వెంట ఉన్నారు.

విధుల కేటాయింపుపై పునరాలోచించాలి

- ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ దివ్యాంగజన్ ఎంప్లాయీస్ అసోసియేషన్

హిందూపురం: సచివాలయ ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు ఆధార్ ఆపరేటర్లుగా విధులు కేటాయించడంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ దివ్యాంగజన్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి.అశ్వత్థ కోరారు. బోధనేతర విధులైన డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించి, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి తిరిగి పాఠశాలలకు వచ్చే విధంగా కృషి చేయడం, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి తనిఖీలు చేపట్టడం, విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను పారదర్శకంగా చేర్చటంలో ఎడ్యుకేషన్ సెక్రటరీస్ పాత్ర కీలకమైనదన్నారు. అంతేకాకుండా గత ప్రభుత్వంలో 'నాడు- నేడు', అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి వాటికి అర్హులను గుర్తించే ప్రక్రియలో కూడా ముఖ్య పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. ఇలాంటి విధుల కోసం నియమించిన ఎడ్యుకేషన్ సెక్రటరీలను ఆధార్ ఆపరేటర్లుగా వినియోగించడాన్ని తాము ఖండిస్తున్నామని చెప్పారు. ఇంటర్ విద్యార్హత కల్గిన ఆధార్ ఆపరేటర్ల విధులకు.. ప్రత్యేకంగా కంప్యూటర్స్‌లో పట్టభద్రులైన వారిని బలవంతంగా కిందిస్థాయి పనులకు వినియోగించటం సాంకేతిక విద్య విలువ తగ్గించడమేనన్నారు.

జిల్లా పోలీసులకు ఉగాది పురస్కారాలు



హేమంత్‌కుమార్ రెడ్డి (ఫైర్ అధికారి)



రంగనాథమ్, లీడింగ్ ఫైర్‌మెన్, పెనుకొండ

పుట్టపర్తి టౌన్: అత్యుత్తమ సేవలందించిన జిల్లాలోని పలువురు పోలీసులను ప్రభుత్వం ఉగాది పురస్కారాలకు ఎంపిక చేసింది.

సేవా పథకాలకు ఎంపికైన వారు ఇలా..

కోటకొండ రామ్మోహన్ (గాండ్లపెంట), రమణారెడ్డి, ఎస్‌ఐ (కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పీఎస్), జి. విజయకుమార్, హెచ్‌సీ (ఏఆర్), బి. చిన్న బాలాజీ ఏఎస్‌ఐ (రొళ్ల), ఎస్. సౌకత్ అలీ, ఎస్‌ఐ (ఏఆర్), ఎన్. శ్రీనివాస్ కుమార్, ఏఎస్‌ఐ (డీసీఆర్‌బీ), అగస్టాన్ పాల్, ఏఎస్‌ఐ (కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పీఎస్), ఎస్. మునేనాయక్, ఏఎస్‌ఐ (ఎన్‌పీ కుంట), టి. హేమంత్‌కుమార్‌రెడ్డి, అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ (పుట్టపర్తి), రంగనాథమ్, లీడింగ్ ఫైర్ మెన్ (పెనుకొండ) ఉన్నారు.